సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 24 । మార్చి । 2025




టమాట కిలో రూ.8

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 6, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



సీమకు తీరని అన్యాయం

రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా చంద్రబాబు తీరని అన్యాయం చేస్తున్నారని సాగునీటి ఉద్యమ, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. 8లో



న్యూస్‌రీల్

నేలకూలిన భారీ వృక్షాలు



హిందూపురం: అసలే వర్షాలు అంతంతమాత్రం. గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోతున్న నేపథ్యంలో పచ్చదనం పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చెట్లను పరిరక్షించుకోవాల్సి ఉండగా కొందరు క్షణాల్లో కూల్చేస్తున్నారు. ఇందుకు అటవీ శాఖ అధికారులు కూడా అనుమతులు ఇవ్వడం గమనార్హం. హిందూపురంలోని గుడ్డం రంగనాథస్వామి ఆలయ సమీపాన విశాలమైన మైదానంలో అనేక ఏళ్లుగా ఫలసాయం అందిస్తున్న 21 చింత చెట్లను ఆదివారం యంత్రాల సాయంతో కూకటివేళ్లతో పెకలించి ముక్కలు చేసేశారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

పుట్టపర్తి టౌన్: శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్, వాహనాల తనిఖీ తదితర చర్యలు చేపట్టారు. రాత్రివేళ గస్తీలు చేపడుతూ నైట్ బీట్ చెకింగ్‌లు ఏర్పాటు చేసి అనుమానితు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజాశాంతికి భంగం కలిగించిన వారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. రోడ్డు నిబంధనలపై అవగాహన కలిగిస్తూ ప్రమాదాలు జరగకుండా సూచనలు చేస్తున్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. హెల్మెట్ ఫేస్‌వాష్‌పై కూడా అవగాహన కలిగిస్తున్నారు. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. గంజాయి, అక్రమ మద్యం రవాణా, నాటుసారాలపై దాడులు చేస్తున్నారు. గ్రామాలను సందర్శించి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీ ఎంపిక



సమావేశంలో పాల్గొన్న డిజిటల్ అసిస్టెంట్లు

పుట్టపర్తి టౌన్: జిల్లా పంచాయతీ కార్యదర్శుల (డిజిటల్ అసిస్టెంట్లు) సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం పట్టణంలోని సాయి ఆరామంలో జిల్లా ఇన్‌చార్జ్ చౌడప్ప ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శి డిజిటల్ అసిస్టెంట్లు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చౌడప్ప, ఉపాధ్యక్షులుగా ప్రశాంతి, భార్గవ్ చౌదరి, జనరల్ సెక్రటరీగా లోకేష్, ట్రెజరర్‌గా రసూల్, జాయింట్ సెక్రటరీలుగా బాలాజీ, సాదిక్‌బాషా, సతీష్, శంకర, కమిటీ మెంబర్లుగా ప్రకాశ్, అశోక్, చంద్రశేఖర్, రవి కాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

ఎస్సీ కాలనీలో విద్యుత్ కనెక్షన్లు కట్



పోట్లమర్రి ఎస్సీ కాలనీలో విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తున్న అధికారులు

బత్తలపల్లి: పోట్లమర్రి ఎస్సీ కాలనీలో 200 యూనిట్లకు మించి వినియోగించిన వారి విద్యుత్ కనెక్షన్లను అధికారులు కట్ చేశారు. కాలనీలో దాదాపు వంద కుటుంబాలు ఉన్నాయి. వీరందరికీ జగ్జీవన్ జ్యోతి స్కీం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలవుతోంది. అయితే 20 కుటుంబాల వారు 200 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించడంతో ఉచితం పరిధి దాటి బిల్లు పరిధిలోకి వచ్చారు. ఆ డబ్బు చెల్లించకపోవడంతో ఆదివారం 12 మంది సిబ్బంది కాలనీలోకి వచ్చి సదరు వినియోగదారుల విద్యుత్ కనెక్షన్లను తొలగించారు. తమకు గడువు ఇస్తే చెల్లిస్తామని ప్రాధేయపడినా వినలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక పాట్లు



తాడిమర్రి మండలం సీసీ రేవు రీచ్‌లో డంప్ చేసిన ఇసుక

ధర్మవరానికి చెందిన ప్రసాద్ నూతన ఇంటి నిర్మాణంలో భాగంగా స్లాబ్‌కు ఏర్పాట్లు చేసుకున్నాడు. ఒకరోజు ముందే ఇసుక కోసం తాడిమర్రి మండలం సీసీ రేవు రీచ్ వద్దకు వెళ్లాడు. అక్కడ ఇసుక విక్రయాలు జరపడం లేదని నిర్వాహకులు తెలిపారు. ఎందుకని అడిగితే టెండర్ రెన్యూవల్ చేయలేదని అందుకే విక్రయాలు నిలిపివేశామని సమాధానమిచ్చారు. చేసేదిలేక ప్రసాద్ అధిక ధర వెచ్చించి బ్లాక్‌లో ఇసుక కొనుగోలు చేశాడు.

రాప్తాడుకు చెందిన ఓ కాంట్రాక్టర్ ఇంటి నిర్మాణాలకు సంబంధించి ప్లాస్టింగ్ కోసం ఇసుక కావాలని ముదిగుబ్బ మండలం పీసీ రేవు ఇసుక రీచ్ వద్దకు టిప్పర్లతో వెళ్లాడు. అక్కడ కూడా విక్రయాలు నిలిపివేశామన్న సమాధానం ఎదురవడంతో ఇసుకను బ్లాక్‌లో కొన్నాడు. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలే.

- కూటమి సర్కారు ప్రచార ఆర్భాటం
- మూతపడిన రెండు ఇసుక రీచ్‌లు
- రెన్యూవల్ చేయడంలో తాత్సారం
- వినియోగదారులకు తప్పని అగచాట్లు
- కృత్రిమ కొరతతో బ్లాక్‌లో భారీ ధరలు
- ఇదీ ధర్మవరం నియోజకవర్గంలో దుస్థితి


ధర్మవరం: కూటమి నేతలు ఎన్నికలకు ముందు ఉచితంగా ఇసుక అందిస్తామని ఆర్భాటపు ప్రకటనలు చేశారు. అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక నదీ, వంక పరివాహక ప్రాంతాల వారికి మాత్రమేనంటూ మెలిక పెట్టి.. రీచ్‌ల ద్వారా విక్రయిస్తున్నారు. ఆ రీచ్‌ల సక్రమంగా నిర్వహించకుండా.. ఇసుకను కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. రీచ్‌ల వద్దకు వెళ్లి డబ్బు పెట్టి కొంటామన్నా ప్రజలకు ఇసుక దొరకని పరిస్థితి నెలకొంది. కారణమేమిటంటే రీచ్‌ల వద్ద ఇసుక టెండర్‌లు దక్కించుకున్న కంపెనీల రెన్యూవల్స్ సకాలంలో చేయకపోవడమే. ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని ముదిగుబ్బ మండలం పీసీ రేవు, తాడిమర్రి మండలం సీసీరేవులలో రెండు ఇసుక రీచ్‌లను ప్రభుత్వం ప్రారంభించింది. ఇందుకు సంబంధించి పీసీరేవులో కేఎల్ఎస్ ఎంటర్‌ప్రైజెస్, సీసీరేవులో విరించి కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలకు టెండర్‌లు కేటాయించింది. ఈ రెండు కంపెనీలు రీచ్‌ల ద్వారా ఇసుకను టన్ను రూ.260తో విక్రయిస్తున్నాయి. దీంతోపాటు వాహనాల అద్దె అదనంగా వినియోగదారులు భరించాల్సి ఉంటుంది.

నాణ్యమైన ఇసుకకు భారీ డిమాండ్

నియోజకవర్గంలోని పీసీ రేవు, సీసీ రేవు రీచ్‌లలో ఇసుక నాణ్యంగా ఉండటంతో పాటు ప్లాస్టింగ్, భవన నిర్మాణాలకు లావు, నైస్ ఇసుక దొరుకుతోంది. జిల్లాలోని ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడులతో పాటు అనంతపురం నుంచి ఇసుక కొనుగోలుకు ప్రజలు రీచ్‌ల వద్దకు వస్తుంటారు. రెండు రీచ్‌ల నుంచి ప్రతి నెలా సగటున 20 వేల టన్నుల దాకా ఇసుక విక్రయాలు జరుగుతుండేవి. ఈ రీచ్‌ల ద్వారా లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరేది.

అక్రమార్కులకు వరం

ప్రభుత్వ రీచ్‌లలో ఇసుక విక్రయాలు నిలిచిపోవడంతో బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల పరిధిలోని చిత్రావతి నది పరీవాహక ప్రాంతాలలో ఇసుకను కొంతమంది కూటమి పార్టీల నాయకులు అక్రమంగా రవాణా చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా నడుస్తోంది. పోలీస్, రెవెన్యూ అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి ఇసుకాసురులు రాత్రింబవళ్లు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా విజిలెన్స్ అధికారులు మాత్రం చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రీచ్‌ల ద్వారా ఇసుకను విక్రయించి అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్డీఓ మహేష్‌ను 'సాక్షి' వివరణ కోరే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.



సీసీ రేవు రీచ్ లోడింగ్ పాయింట్‌లో నిలిచిపోయిన ఇసుక విక్రయాలు

నిలిచిన ఇసుక విక్రయాలు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు ఇసుక రీచ్‌ల రెన్యూవల్ గడువు వారం రోజుల క్రితం ముగియడంతో ఇసుక విక్రయాలు ఆగిపోయాయి. దీంతో నిర్మాణ పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. అత్యవసరం ఉన్న వారు బ్లాక్‌లో అదనపు డబ్బు చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఇసుక దోపిడీ అడ్డగింత



ఇసుక తవ్వకాలను అడ్డుకుంటున్న రైతులు

గోరంట్ల: బూదిలి సమీపాన చిత్రావతి నదిపై బ్రిడ్జి నిర్మాణం మాటున కాంట్రాక్టర్ ఇసుక దోపిడీకి పాల్పడ్డారు. హిటాచీలు పెట్టి ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేస్తుండడంతో ఆదివారం సాయంత్రం బూదిలి సర్పంచ్ రామాంజనేయులు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, బూదిలి, పాపిరెడ్డిపల్లి, గొల్లపల్లి, గంగాదేవపల్లి గ్రామాల చిత్రావతి పరివాహక ప్రాంత రైతులు పెద్ద సంఖ్యలో చేరుకుని అడ్డుకున్నారు. బ్రిడ్జి నిర్మాణం పేరిట అవసరానికి మించి ఎందుకు ఇసుక తవ్వి డంప్ చేస్తున్నారని కాంట్రాక్టర్‌ను నిలదీశారు. ఒక వేళ చిత్రావతి నది నుంచి ఇసుక తవ్వకం, తరలింపునకు అనుమతులు తీసుకుంటే పత్రాలు చూపాలని డిమాండ్ చేశారు. దీనికి కాంట్రాక్టర్ తరపు నుంచి సరైన సమాధానం రాలేదు. ఇక్కడ తవ్విన ఇసుకను బ్రిడ్జి కోసం కాకుండా ఇతర పనుల్లో వాడేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆరోపించారు. చిత్రావతి నదిలోని ఫిల్టర్ బోరుబావుల కింద వందలాది ఎకరాల్లో పంటలు సాగు చేసుకున్నామని, ఇసుకను ఎడాపెడా తవ్వేస్తే భూగర్భజలాలు తగ్గిపోయి పంటలు ఎండిపోయే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక తవ్వే క్రమంలో ఫిల్టర్ బోర్లను ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.



జేసీబీలతో ఇసుక తవ్వుతున్న దృశ్యం

ప్రకృతి ప్రకోపం.. రైతులకు తీరని నష్టం

- వడగండ్ల వర్షం, ఈదురు గాలులకు నేలకొరిగిన పంటలు

తాడిమర్రి: ప్రకృతి ప్రకోపం అన్నదాతలకు తీరని నష్టం మిగిల్చింది. శనివారం రాత్రి మండలంలో వడగండ్ల వర్షం, ఈదురుగాలులకు అరటి, దానిమ్మ, మొక్కజొన్న, టమాట పంటలు నేలకొరిగాయి. నాయనపల్లిలో రైతులు జానగాన పెద్దవీరనారప్ప, జడే శంకరయ్య, జడే నడిపి గంగన్న, జడే ఆది, బి.దస్తగిరి, పాళ్యం రహంతుల్లా, జడే శంకర్, డి.చెన్న యల్లప్ప, జె.శివయ్యతో సహా 15 మంది సాగు చేసిన అరటి తోటలు వడగండ్ల వర్షానికి దెబ్బతిన్నాయి. అరకొర పంటను కోసి అమ్ముకున్న మరో 20 మంది రైతులకూ తీరని నష్టం కలిగింది. దాడితోట గ్రామంలో ఈదురుగాలులకు రైతులు పాళ్యం రాము, పాళ్యం ఈశ్వరయ్య, సరిబాల రాజారెడ్డి, రవీంద్రారెడ్డి, పుల్లారెడ్డి, జొన్నగడ్డల శ్రీనివాస నాయుడు, బాలకృష్ణ తదితరులు సాగు చేసిన 130 ఎకరాల్లోని అరటి తోటలు ధ్వంసమయ్యాయి. తురకవారిపల్లిలో తమ్మినేని నరసింహనాయుడు, శ్రీరాములు, సూర్యనాగరాజు, పి.నారాయణ, నాగభూషణ, టి.నాగభూషణకు చెందిన దానిమ్మ చెట్లు నేలకొరిగాయి. ఇక టమాట తదితర పంటలు కూడా దెబ్బతిన్నాయి. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



దాడితోటలో నేలకొరిగిన అరటి తోటను చూపుతున్న రైతు



తాడిమర్రి మండలం నాయనపల్లిలో దెబ్బతిన్న టమాట పంట

ప్రభుత్వమే ఆదుకోవాలి

ముదిగుబ్బ: మండలంలోని ఈదులపల్లి, ఇందుకూరు గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులకు రైతులు ఓంశేఖర్, లోక్‌నాథ్‌రెడ్డిలకు చెందిన 3,500 అరటి చెట్లు నేలకొరిగాయి.ఒక్కొక్కరికి దాదాపు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



ఈదులపల్లిలో ఈదురుగాలులకు విరిగిన అరటి చెట్లు

కనుల పండువగా పుష్పయాగోత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నారసింహుడు

- ముగిసిన నృసింహుని బ్రహ్మోత్సవాలు

కదిరి: పక్షం రోజుల పాటు సాగిన ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి పుష్పయాగోత్సవంతో ముగిశాయి. ఈ ఉత్సవం కనుల పండువగా, అత్యంత వైభవంగా సాగింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా సాగేందుకు సహకరించిన అష్ట దిక్పాలకులు, పంచ భూతాలు, దేవతా మూర్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారిని.. వారి వారి లోకాలకు సాగనంపేందుకు నిర్వహించినదే ఈ పుష్పయాగోత్సవమని ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు వివరించారు. తీర్థవాది ఉత్సవం ముగియగానే శనివారం సాయంత్రం నుంచి ఆలయం తలుపులు మూసివేసిన విషయం తెలిసిందే. తిరిగి ఆదివారం వేకువ జామునే ఆలయ ద్వారాలు తెరిచి మహా సంప్రోక్షణ గావించారు. అనంతరం స్వామివారికి నిత్య పూజాది కైంకర్యాలను నిర్వహించిన మీదట భక్తులకు ఆలయంలో శ్రీవారి సర్వ దర్శన భాగ్యం కలిగించారు. రాత్రి రంగమండపంలో శ్రీదేవి, భూదేవిల సమేత శ్రీవారిని కర్ణాటక నుంచి తెప్పించిన పుష్పాలతో అలంకరించారు. ఉత్సవానికి ఉభయ దారులుగా రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పూల అశ్వర్థనారాయణ కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ సహాయ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ జోరు

- మొదలైన ఐపీఎల్ మ్యాచ్‌ల సందడి
- అభిమానుల అమితాసక్తిపై బుకీల వల
- బెట్టింగ్‌లోకి దింపి.. గుల్ల చేస్తున్న వైనం



హిందూపురం అర్బన్: ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025 (ఐపీఎల్) 18వ సీజన్ మొదలైంది. ఉత్కంఠగా సాగే ఈ క్రికెట్ మ్యాచ్‌లను అభిమానులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. అభిమానుల ఉత్సాహాన్ని సొమ్ము చేసుకోవడానికి బుకీలు రంగంలోకి దిగారు. 'మీ ఫేవరెట్ టీమ్ గెలుస్తుందా.. నిజంగా టీమ్‌పై అభిమానం ఉంటే బెట్టింగ్ కట్టవచ్చు కదా.. సరదాకు సరదా.. డబ్బులూ గెలుచుకోవచ్చు.. అంటూ చిన్నగా ముగ్గులోకి దించుతున్నారు. బెంగళూరు కేంద్రంగా హిందూపురం, కదిరి, పెనుకొండ, ధర్మవరం, మడకశిర పట్టణాలే కాకుండా మండల కేంద్రాలకు .. గ్రామాలకు బెట్టింగ్ వ్యవహారం విస్తరిస్తోంది. ఇదేమీ గుట్టుగా కాదు ఆన్‌లైన్ ద్వారా బహిరంగంగానే సాగిస్తున్నారు. బెట్టింగ్ అంతా సెల్ ఫోన్‌లోనే సాగుతోంది. ఇరువురు ఫోన్‌లలోనే కాంటాక్ట్ చేసి బెట్టింగులు కాయిస్తున్నారు. గెలిచిన వారి నుంచి కమీషన్ పొందేలా ఏర్పాట్లు చేసుకొన్నారు. పట్టణాలు, పల్లెల్లోని యువకులను టార్గెట్ చేస్తున్నారు. జిల్లాలో ఎంతోమంది యువకులు బెట్టింగ్‌లో ఓడి అప్పుల పాలైన సంఘటనలు గతంలో వెలుగుచూశాయి. కొందరు పీకల్లోతు అప్పుల్లోకి కూరుకుపోయి జీవితాలు నాశనం చేసుకొన్న విషయమూ విదితమే.

ప్రతి బంతికీ ఓ రేటు..

టాస్ వేసే సమయం నుంచి బ్యాటింగ్ ఎవరు ఎంచుకొంటారు.. బౌలింగ్ ఎవరు చేస్తారు.. ఏ క్రికెటర్ ఎన్ని పరుగులు తీస్తాడు.. ఓవర్‌కు ఎన్ని పరుగులు వస్తాయి.. ఎవరు గెలుస్తారు.. ఎన్ని పరుగులతో మ్యాచ్ పూర్తి కానుంది .. ఇలా ప్రతి దానికీ ఒక పందెం ఉంటుంది.

ప్రత్యేక యాప్‌ల ద్వారా..

ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లో క్రికెట్ బెట్టింగ్ ఆడేవారు కొన్ని యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని మ్యాచ్‌లను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ పందేలు కాయడం.. మ్యాచ్ చూసేందుకు ఒకటి.. బెట్టింగ్ కాసేందుకు మరో మొబైల్ వినియోగించి ఆన్‌లైన్‌లో క్రికెట్ బుకీలు సంప్రదింపులు జరుపుతూ కమీషన్ పొందుతున్నారు.

ఇక స్థానికంగానూ..

హిందూపురం, ధర్మవరం, కదిరి లాంటి పెద్ద పట్టణాల్లోనే కాకుండా మండల కేంద్రాల్లోనూ యువత పోగై తమకు అనువైన ప్రదేశాలను ఎంచుకొని అక్కడికి చేరుకొని నేరుగా బెట్టింగ్‌లకు దిగుతున్నారు. గతంలో ఎవరెవరు బెట్టింగ్‌లకు పాల్పడింది గుర్తించిన కొంత మంది పోలీసులు సైతం సొమ్ము చేసుకొంటున్నారు.

అప్పుడే మొదలైన జోరు..

పట్టణాలు, గ్రామాల్లో అప్పుడే యువత బెట్టింగ్‌ల జోరు కనిపిస్తోంది. ప్రధానంగా ఏయే తేదీల్లో ఎవరెవరి మధ్య మ్యాచ్ జరగనుందో తెలుస్తుండటంతో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ , ముంబై టీమ్‌లపై బెట్టింగ్‌లు కాయనుండగా.. వీరిని కొందరు బుకీలు తమ వైపు తిప్పుకొని డబ్బు కాజేస్తున్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై చర్యలు



క్రికెట్ బెట్టింగ్‌ల పేరుతో యువతను ఊబిలోకి దించి ఆన్‌లైన్‌లో, ప్రత్యేక యాప్‌ల ద్వారా నేరుగా ఆడించి కమీషన్లు పొందే వారిపై కఠిన చర్యలు తప్పవు. యువత కూడా క్రికెట్ మోజులో పెడదారి పట్టకుండా జాగ్రత్త పడాలి. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలి.

– కె.వి.మహేష్, డీఎస్పీ, హిందూపురం

కోడ్ లాంగ్వేజ్‌లతో..

బెట్టింగ్ వ్యవహారం అంతా కోడ్ లాంగ్వేజీలోనే సాగేలా ఏర్పాట్లు చేసుకొన్నారు. సెల్ ఫోన్‌లోనే ఎస్.. నో.. ఓకే.. డన్.. ఈటింగ్ వంటి పదాలు దీని కోసం వాడనున్నారు. చాలామంది సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోయి పందేలు కాసేందుకు ప్రత్యేక కేంద్రాలను సిద్ధం చేసుకొన్నారు. ఇందుకు హిందూపురం పట్టణంలో బెంగళూరు రోడ్డు, మోడల్ కాలనీ, ముద్దిరెడ్డిపల్లి, దండు రోడ్డు, చిలమత్తూరు, లేపాక్షి మండల కేంద్రాల్లో కొంతమంది యువత తమకు అనువైన ప్రదేశాలకు మ్యాచ్ టైమ్‌లో చేరుతున్నారు. టీవీలు చూస్తూ పందేలు కాస్తున్నారు. గ్రౌండ్‌లో చూసే ఆటకు.. టీవీల్లో చూసే వారికి రెండు నుంచి మూడు బంతుల సమయం తేడా ఉంటుంది. ఆట ముందే తెలుసుకొని బెట్టింగులు కాసే వారి జేబులను బుకీలు గుల్ల చేస్తున్నారు. ఇది యువత గమనించాలి. మ్యాచ్‌లో ఎవరు గెలవనున్నారు.. ఎవరు ఓడి పోతారు.. ఎవరెన్ని పరుగులు చేస్తారు.. ఈ ఓవర్‌లో ఎన్ని పరుగులు వస్తాయనే కోణంలోనూ పందేలు కాయడం మొదలైంది.

హనీ ట్రాప్ కేసులో నలుగురికి రిమాండ్

లేపాక్షి: హనీ ట్రాప్ కేసులో నలుగురుని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలను లేపాక్షి ఎస్ఐ నరేంద్ర ఆదివారం వెల్లడించారు. లేపాక్షి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బప్పకు ఈ నెల 17న గుర్తు తెలియని మహిళ నుంచి పలుమార్లు ఫోన్ కాల్ వచ్చింది. ఆ సమయంలో ఆమెతో చనువుగా మాట్లాడాడు. ఈ సంభాషణను రికార్డు చేసుకున్న ఆమె... దాని ఆధారంగా ఇతరులతో కలసి డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేయడం మొదలు పెట్టింది. తాను కోరిన మేరకు డబ్బు చెల్లించకపోతే కేసులు బనాయించి, గ్రామంలో పరువు తీస్తామని బెదిరింపులకు దిగారు. దీంతో రూ.1.05 లక్షలను ఫోన్ పే రూపంలో చెల్లించాడు. అయినా వారి వేధింపులు కొనసాగడంతో తాళలేక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు... ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఆదివారం ఉదయం పది గంటలకు కొడికొండ-సిరా మార్గంలోని జాతీయ రహదారిపై కల్లూరు క్రాస్ వద్ద ఓ మహిళతో పాటు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో లేపాక్షి మండలం కొండూరు గ్రామానికి చెందిన సి.ఎస్.ధనుంజయ, పి.రమేష్, లేపాక్షి గ్రామానికి చెందిన రవికుమార్, కొండూరు గ్రామానికి చెందిన కె.రాధమ్మ (ప్రస్తుతం హిందూపురంలోని డీఆర్ కాలనీ నివాసి) ఉన్నారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

సూక్ష్మ సేద్యం పరికరాల దగ్ధం



మంటల్లో కాలిపోతున్న పైపులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని పులేటిపల్లి గ్రామ సమీపంలో పొలాల్లో ఉంచిన డ్రిప్, స్ప్రింక్లర్ల పైపులు ఆదివారం అగ్నికి ఆహుతైనట్లు రైతు వాపోయాడు. వివరాలు... గ్రామానికి చెందిన రైతు దాసరి పెద్దన్న తన పొలంలో ఉన్న వేప చెట్టు కింద 30 స్ప్రింక్లర్ల పైపులు, 15 కట్టల డ్రిప్ పైపును భద్ర పరిచాడు. ఆదివారం మధ్యాహ్నం ఉన్నఫలంగా మంటలు వ్యాపించి సూక్ష్మ సేద్యం పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. ఘటనతో రూ.50 వేల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

'రెవెన్యూ' బెదిరింపులు.. రైతు ఆత్మహత్యాయత్నం

బత్తలపల్లి: రెవెన్యూ అధికారుల బెదిరింపులతో ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలం ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన రైతు నారాయణస్వామికి గ్రామంలో తనకున్న 2.43 ఎకరాల పొలంలో వ్యవసాయంతో పాటు గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గొర్రెల పోషణకు తన పొలంలో కంచె వేయాలని నిర్ణయించుకుని ఇప్పటికి ఐదు దఫాలుగా రెవెన్యూ అధికారులతో సర్వే చేయించాడు. అధికారులు నిర్దేశించిన హద్దుల మేరకు తన భాగానికి వచ్చిన పొలంలో కంచె వేసేందుకు సిద్ధం కాగా, పక్క పొలం రైతు అభ్యంతరాలు లేవనెత్తాడు. అంతటితో ఆగకుండా విషయాన్ని గ్రామ సర్వేయర్ రవికిరణ్, వీఆర్‌ఓ నాగేంద్ర దృష్టికి తీసుకెళ్లడంతో వారు నారాయణస్వామికి ఫోన్ చేసి కంచె ఎలా వేస్తావంటూ బెదిరింపులకు దిగారు. దీంతో మనస్తాపానికి గురైన నారాయణస్వామి శనివారం తన పొలంలోనే క్రిమి సంహారక మందు తాగాడు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం ఉప్పర్లపల్లికి చేరుకుని కుటుంబ సభ్యులతో కలసి ఆరా తీశారు. ఘటనపై ఫిర్యాదు స్వీకరించారు. బెంగళూరులోని ఆస్పత్రికి పోలీసులు వెళ్లి బాధితుడి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. కాగా, తాము బెదిరించలేదని, సమస్యను పరిష్కరించేందుకు సర్దిచెప్పినట్లు పోలీసుకు వీఆర్వో నాగేంద్ర, సర్వేయర్ రవికిరణ్ తెలిపినట్లు సమాచారం.

సీమకు తీరని అన్యాయం

- అమరావతి ప్రయోజనమే రాష్ట్ర ప్రయోజనాలుగా భావిస్తున్న సీఎం చంద్రబాబు
- రాయలసీమ హక్కుల కోసం ఐక్య ఉద్యమాలు చేపట్టాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ, ప్రజా సంఘాల, సాగునీటి ఉద్యమ నాయకుల పిలుపు



ఐక్యతను చాటుతున్న సాగునీటి ఉద్యమ, రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు

అనంతపురం సెంట్రల్: రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా వెనుకబడిన ప్రాంతాలకు సీఎం చంద్రబాబు తీరని అన్యాయం చేస్తున్నారని సాగునీటి ఉద్యమ, రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు మండిపడ్డారు. అమరావతి ప్రయోజనమే రాష్ట్ర ప్రయోజనమనే విధంగా సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. వెనుకబడిన అనంతపురం జిల్లా ప్రయోజనాల కోసం ఐక్య ఉద్యమాలు చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందని, ఇందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 'జిల్లా ప్రాజెక్టులు– విభజన హామీలు' అంశంపై అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న బీజీఆర్ ఫంక్షన్ హాల్‌లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ రమణ అధ్యక్షతన ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో పలువురు మేధావులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, సాగునీటి ఉద్యమ నాయకులు ఏమన్నారో... వారి మాటల్లోనే...

రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాలి



ఏటా 50 టీఎంసీల కృష్ణా వరద జలాలు వస్తే తప్ప కరువు ప్రాంతమైన అనంత బాగుపడదు. ఇందుకు సరిపడా రిజర్వాయర్ల నిర్మాణం జరిగేలా పోరాటాలు సాగించాలి. సీఎం చంద్రబాబుకు రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణాలు తప్ప ఈ ప్రాంత రైతుల గోడు పట్టడం లేదు.

– నారాయణ, రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక

హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేయాలి



హంద్రీ–నీవా ప్రాజెక్టుకు రోజూ ఓ టీఎంసీ నీటిని తీసుకువచ్చేలా కాలువ వెడల్పు జరిగితే తప్ప జిల్లాలో రైతాంగ మనుగడ సాగదు. కాలువకు లైనింగ్ పనులు చేయకూడదని జిల్లా ప్రజానీకం నినదిస్తుంటే టీడీపీ ప్రజాప్రతినిధులు లైనింగ్ పనులకు ప్రారంభోత్సవాలు చేయడం సిగ్గుచేటు. రాయలసీమ ప్రాజెక్టులు పూర్తి చేసేలా కలిసికట్టుగా ఉద్యమించాలి.

– రామ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి, జలసాధన కమిటీ

బాధాకరం



రాయలసీమకు నీళ్లు ఇవ్వాలని చెబుతూ పోలవరం, గోదావరి–బనకచర్ల ప్రాజెక్టులు చేపడుతుండడం బాధాకరం. ఈ ప్రాజెక్టులతో రాయలసీమ ప్రాంతానికి ఏ మాత్రం సంబంధం లేదు. తుంగభద్ర, హంద్రీ–నీవా ప్రాజెక్టులను బలోపేతం చేసుకోవాలి. హెచ్చెల్సీ వెడల్పు, హంద్రీ–నీవా కాలువను 10వేల క్యూసెక్కులకు వెడల్పు చేయాలి.

– మల్లికార్జున, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

పోరాటాల ద్వారానే సాధ్యం



రాయలసీమ ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో డాక్టర్ వైఎస్సార్ హంద్రీనీవా ప్రాజెక్ట్‌ను 90 శాతం పూర్తి చేశారు. ఆ లక్ష్యానికి రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. ఈ అంశంపై కేవలం సమావేశాలతో కాకుండా ప్రజల్లోకి వెళ్లి చైతన్యం తీసుకురావాలి. హంద్రీ–నీవా ప్రాజెక్ట్‌కు 40 టీఎంసీల నికర జలాలను కేటాయించేలా పోరాటాలు సాగించాలి.

– వై.మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ

గిట్టుబాటు ధర కల్పించాలి



పంటలకు గిట్టుబాటు ధర లేదు. కొద్దిరోజుల క్రితం టన్ను చీనీ రూ. 25వేల వరకూ ధర పలికితే ఈ రోజు రూ. 10వేలకు చేరుకుంది. మిరప రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలాంటి తరుణంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. పంటలను నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజ్ పాయింట్‌లను నిర్మించాలి.

– చంద్రశేఖరరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

తీరని అన్యాయం



రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోంది. కర్నూలు నుంచి హైకోర్టును తరలించుకుపోతున్నా మాట్లాడేవాళ్లు లేరు. ఇప్పటికైనా ప్రజలు అప్రమత్తం కావాలి. హంద్రీ–నీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేపడితే రైతులకు తీరని నష్టం కలుగుతుంది. కాబట్టి హంద్రీ–నీవా ద్వారా 65 టీఎంసీలు సాధించుకునే లక్ష్యంగా ఉద్యమాలు చేపట్టాలి.

– వై. విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

సీమ హక్కుల పరిరక్షణకు ఉద్యమం



సీఎంగా వైఎస్ జగన్ కర్నూలును జ్యుడిషియల్ రాజధాని చేస్తే... ఇప్పుడు అమరావతికి తరలిస్తున్నారు. కడప నుంచి ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కూడా తరలిస్తున్నారు. సీమ ప్రాంతాల అభివృద్ధికి ఆటంకంగా మారిన తరలింపులను అడ్డుకుంటాం. రాయలసీమ హక్కులను కాపాడేందుకు ఉద్యమిస్తాం.

– వెన్నపూస రవీంద్రారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం

శాశ్వత పరిష్కారం చూపాలి



నిత్య కరువు పీడిత ప్రాంతంగా ఉన్న అనంతను సస్యశ్యామలం చేసేందుకు శాశ్వత పరిష్కారం చూపాలి. హంద్రీ–నీవా లైనింగ్ పనులపై సర్వత్రా రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీనిపై జిల్లాలోని టీడీపీ ప్రజాప్రతినిధులు స్పందించాలి. రాజకీయాలు పక్కన పెట్టి జిల్లా ప్రయోజనాల కోసం కలిసికట్టుగా ఉద్యమించాలి.

– రమేష్ గౌడ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

రైతులకు తీరని నష్టం



జిల్లాలో మార్కెటింగ్ లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఇటు హైదరాబాద్, అటు బెంగుళూరు లాంటి నగరాలకు వెళ్లి మార్కెటింగ్ చేసుకోలేకపోతున్నారు. ఈ సమస్యను అధిగమించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ధరల స్థిరీకరణ నిధి, పంటలకు ఇన్సూరెన్స్, కోల్డ్ స్టోరేజ్ పాయింట్‌లు, ప్రాసెసింగ్‌యూనిట్లు నిర్మించాలి.

– వంశీగోకుల్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ

ఆ జీఓలను రద్దు చేయాలి



హంద్రీ–నీవా కాలువకు లైనింగ్ పనులు చేస్తే ఉమ్మడి జిల్లాకు శాశ్వతంగా అన్యాయం జరుగుతుంది. వెంటనే ఆ జీఓలను రద్దు చేయాలి. ఉమ్మడి జిల్లాలో పెనుకొండకు మంజూరైన మెడికల్ కాలేజీని పూర్తి చేయాలి. కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో మెడికల్ కళాశాలలు నిర్మించాలి.

– ఆనంద రంగారెడ్డి, సాగునీటి ఉద్యమకారుడు, మడకశిర

సాఫ్ట్‌వేర్ ఉద్యోగమంటూ ఘరానా మోసం

గార్లదిన్నె: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు... గార్లదిన్నె మండలం కనుంపల్లికి చెందిన మంజునాథ్‌రెడ్డి బీటెక్ పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. నిరుద్యోగిగా ఉన్న సమయంలో శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లికి చెందిన నరసింహులు అనే యువకుడితో పరియమైంది. ఆ సమయంలో నరసింహులు తాను తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కన్సెల్టెన్సీ ఏజెన్సీలు నడుపుతున్నానని, బీటెక్ పూర్తి చేసిన వారికి ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తున్నట్లుగా నమ్మబలికాడు. రూ.6 లక్షలు చెల్లిస్తే మంచి ప్యాకేజీతో ఉన్నత శ్రేణి కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. అంత డబ్బు తన వద్ద లేకపోవడంతో మంజునాథరెడ్డి మిన్నకుండిపోయాడు. అయితే పదేపదే నరసింహులు కలసి హంగామా చేస్తుండడంతో అతని మాయలో మంజునాథరెడ్డి చిక్కుకున్నాడు. ఉద్యోగం వస్తుందన్న ఆశతో తన బంధువుల వద్ద రూ. 6 లక్షలు అప్పు చేసి 2024, జూన్‌లో విడతల వారీగా నరసింహులు ఫోన్ పే, బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేశాడు. మంజునాథ్‌రెడ్డి ప్రయత్నాలను గమనించిన అనంతపురానికి చెందిన ఆయన స్నేహితుడు కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వస్తుందన్న ఆశతో నరసింహులకు రూ.6లక్షలు చెల్లించారు. నగదు బదలాయింపులు జరిగిన తర్వాత ఉద్యోగావకాశాలు కల్పించకపోవడంతో పలుమార్లు నరసింహులును అభ్యర్థిస్తూ వచ్చినా ఫలితం లేకపోయింది. ఉద్యోగం ఇప్పించలేక పోతే తమ డబ్బు వెనక్కు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. దీంతో నరసింహులు ముఖం చాటేశాడు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మంజునాథరెడ్డికి అనుమానం వచ్చి కొన్ని రోజుల క్రితం చెన్నేకొత్తపల్లికి వెళ్లి నరసింహులు కోసం ఆరా తీశాడు. అక్కడ ఆయన ఆచూకీ లభ్యం కాకపోవడంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి, నరసింహులు కోసం గాలింపు చేపట్టారు.

కాక రేపుతున్న కొల్లేరు



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

అనంతపురం: ఐపీఎల్ తరహాలో సాగుతున్న ఏపీ సూపర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో కొల్లేరు క్లబ్ జట్టు కాకరేపుతోంది. రాష్ట్రంలో తొలిసారిగా ఏపీ సూపర్ కప్‌ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కలిపి 8 జోన్‌లుగా, 8 క్లబ్‌లుగా విభజించి నిర్వహిస్తున్న ఈ టోర్నీలో కొల్లేరు క్లబ్ జట్టులో ఏలూరు, తూర్పుగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు ఉన్న విషయం తెలిసిందే. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో సాగుతున్న ఈ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. అనంతపురంలోని ఆర్డీటీ క్రీడాగ్రామం వేదికగా సాగుతున్న ఈ టోర్నీలో భాగంగా ఇప్పటి వరకూ జరిగిన మ్యాచ్‌ల్లో అన్నింటా విజయం సాధించి కొల్లేరు క్లబ్ జట్టు 12 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. కాగా, టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో నల్లమల క్లబ్ జట్టుపై తలపడిన విశాఖ క్లబ్... 3–1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో తుంగభద్ర క్లబ్‌పై ఏకంగా ఐదు గోల్స్ సాధించి గోదావరి క్లబ్ జట్టు (5–0) విజయం కైవసం చేసుకుంది. కొల్లేరు –కోరమాండల్ క్లబ్ జట్ల మధ్య జరిగిన మూడో మ్యాచ్‌లో 2–0 గోల్స్ తేడాతో కొల్లేరు క్లబ్ విజయకేతనం ఎగురవేసింది.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి



మృతి చెందిన గొర్రె, మేక పిల్లలు

ఎన్‌పీకుంట: వీధి కుక్కలు దాడి చేయడంతో గొర్రె పిల్లలు మృతి చెందాయి. ఎన్‌పీకుంట మండలం ఎస్‌కే తండా గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. తండాకు చెందిన రైతు దుంగావత్ కృష్ణానాయక్ పాడితో పాటు గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన ఇంటిక సమీపంలోని గొర్రెల కోసం ఓ దొడ్డిని ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం ఉదయం గొర్రె, మేక పిల్లలను దొడ్డిలో వదిలి ఇంటికి వెళ్లి వచ్చేసరికి వీధి కుక్కలు చొరబడి 10 గొర్రె పిల్లలు, పది మేక పిల్లలను చంపేశాయి. రూ.90 వేలు నష్ట పోయినట్లు రైతు వాపోయాడు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హిందూపురం: మండలంలోని కొటిపి– కెంచనపల్లి గ్రామాల మధ్య నిర్జన ప్రదేశంలో శనివారం అర్ధరాత్రి పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.30 వేలు నగదు, మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చంద్ర ఆంజనేయులు తెలిపారు. వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. అందిన సమాచారంతో అప్రమత్తమైన సిబ్బంది కొటిపి– కెంచనపల్లి గ్రామాల మధ్య పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో హంద్రీ–నీవా కెనాల్ పక్కన పేకాట ఆడుతున్న 8 మంది పట్టుబడ్డారు. వివిధ ప్రాంతాలకు చెందిన పేకాట రాయుళ్లను సమీకరించుకుని కొటిపి గ్రామానికి చెందిన రాము అలియాస్ బజ్జి ఇక్కడ స్థావరాన్ని ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున పేకాట నిర్వహిస్తున్నట్లుగా గుర్తించారు. జూదరులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

సోమందేపల్లి: స్థానిక సప్తగిరి కాలనీ, గీతానగర్‌లో రూ.1.50 కోట్లతో తలపెట్టిన సీసీ రోడ్లు డ్రైనేజీ పనులను మంత్రి సవిత ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్ర కుమార్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన వార్డెన్



దెబ్బలకు కంది పోయిన విద్యార్థి శరీరం

ధర్మవరం: మండలంలోని నాగలూరు వద్ద ఉన్న పీసీఎంఆర్ పాఠశాల వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థిపై కిషోర్‌ని ఆదివారం రాత్రి వార్డెన్ సందీప్ చితకబాదాడు. బాధిత విద్యార్థి తెలిపిన మేరకు... ఆదివారం రాత్రి స్టడీ అవర్ ముగిసిన తర్వాత డయాస్ పైకి వెళ్లాలని వార్డెన్ తెలిపాడు. దీంతో కిషోర్ డయాస్‌పైకి వెళుతుండగా 'ఇంకా ఇక్కడే ఉన్నావా' అంటూ వార్డెన్ ఓ పైపు తీసుకుని బలంగా కొట్టాడు. అంతటితో ఆగకుండా 'నీవు ఎంపీపీ సంగాలప్ప కొడుకువురా' అంటూ దుర్భాషలాడుతూ పదేపదే పైపుతో కొట్టాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హాస్టల్ వద్దకు చేరుకునేలోపు వార్డెన్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వీపుపై, కాళ్లపై బలమైన గాయాలు కావడంతో అక్కడే కుప్పకూలి పోయిన విద్యార్థిని తల్లిదండ్రులు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు.

8 మందిపై హత్యాయత్నం కేసు నమోదు

గోరంట్ల: ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణకు సంబంధించి 8 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. గోరంట్ల మండలం కంగారెడ్డిపల్లికి చెందిన రంగారెడ్డి, హిందూపురానికి చెందిన రాజశేఖర్‌రెడ్డికి మధ్య కొంత కాలంగా భూ వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వేటకొడవళ్లు, ఇనుపరాడ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఘటనకు సంబంధించి రంగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హిందూపురానికి చెందని రాజశేఖర్‌రెడ్డి, కంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బయపరెడ్డి, నరేంద్రరెడ్డిపై, రాజశేఖరరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎరువుల అంగడి రంగారెడ్డి, అశ్వత్థరెడ్డి, జగన్నాథరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, జనార్దనరెడ్డిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు వేటకొడవళ్లు, ఓ ఇనుప రాడ్ స్వాధీనం చేసుకున్నారు.

చీనీ చెట్లు దగ్ధం



కాలిపోయిన చీనీ చెట్టును చూపుతున్న రైతు మురళి

కనగానపల్లి: ఆకతాయిలు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగి చీనీ తోట దగ్ధమైంది. వివరాలు.. కనగానపల్లి మండలం శివపురం గ్రామానికి చెందిన రైతు మురళి తనకున్న నాలుగు ఎకరాల్లో ఐదేళ్ల క్రితం 350 చీనీ మొక్కలు నాటాడు. ప్రస్తుతం పంట కాయ దశలో ఉంది. ఆదివారం మధ్యాహ్నం తోటకు సమీపంలోని ఎండు గడ్డికి ఆకతాయిలు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగి తోటను చుట్టుముట్టాయి. చుట్టుపక్కల రైతులు గమనించి మంటలు ఆర్పే లోపు 200 చీనీ చెట్లు, డ్రిప్ పరికరాలు, పైపులు కాలిపోయాయి. రూ.3.5 లక్షల మేర నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. రెవెన్యూ, ఉద్యానశాఖ అధికారులు పరిశీలించి తనకు నష్టపరిహారం అందించాలని వేడుకున్నాడు.

విస్తరిస్తున్న క్షయ

నేడు ప్రపంచ క్షయ దినోత్సవం

- ఏడాదిలో తేలిన 2,119 పాజిటివ్ కేసులు
- జిల్లా వ్యాప్తంగా 8 చోట్ల యూనిట్లు



హిందూపురంలోని క్షయ యూనిట్



పుట్టపర్తిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

క్షయ వ్యాధి లక్షణాలు

- రెండు వారాల పాటు క్రమం తగ్గని దగ్గు
- రెండు వారాలకు మించి జ్వరం
- తెలియకుండా బరువు తగ్గిపోవడం
- రాత్రిపూట చెమటలు పట్టడం

సాక్షి, పుట్టపర్తి: జిల్లాలో క్షయ వ్యాధి నానాటికీ విస్తరిస్తోంది. వయసుతో సంబంధం లేకుండా రోజురోజుకీ పాజిటివ్ కేసులు పెరిగిపోతున్నాయి. సకాలంలో చికిత్స చేయించుకోకపోవడం, పాజిటివ్‌గా నిర్ధారణ అయినా మందులు సక్రమంగా వాడకపోవడం వంటి కారణాలతో బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. జిల్లాలో ఏటా వేల మంది క్షయ వ్యాధి బారిన పడుతున్నారు. జాగ్రత్తలు పాటించకపోవడమే ఇందుకు కారణంగా వైద్యాధికారులు చెబుతున్నారు. ఇతర వ్యాధులతో పోలిస్తే క్షయ చాలా ప్రమాదకారి వ్యాధిగా వైద్యులు చెబుతున్నారు. ఆరంభంలోనే గుర్తించి మందులు సక్రమంగా వాడితే నివారణ సాధ్యమని, లేకపోతే ప్రాణాపాయం తప్పందని హెచ్చరిస్తున్నారు.

గాలి ద్వారా సులువుగా..

'మైక్రో బ్యాక్టీరియం ట్యూబర్ క్యులోసిస్' బ్యాక్టీరియా ద్వారా క్షయ వ్యాధి సోకుతుందని నిపుణులు అంటున్నారు. ఈ బ్యాక్టీరియా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి సులువుగా సంక్రమిస్తుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో వేగంగా విస్తరిస్తుంది. రోగి దగ్గినప్పుడు, ఉమ్మినప్పుడు, చీదినప్పుడు రోగ కారక క్రిములు గాలిలోకి చేరుతాయి. తద్వారా మరొకరి శరీరంలోకి ప్రవేశిస్తాయి. క్షయ రోగి ఓసారి దగ్గితే సుమారు 40 వేల వరకు వ్యాధికారక క్రిములు గాల్లో కలుస్తాయి. ప్రజల్లో అవగాహన లేని కారణంగా ఒకరి నుంచి మరొకరికి సులువుగా సోకుతోందని వైద్యులు అంటున్నారు.

ముంచుతోన్న నిర్లక్ష్యం

క్షయ వ్యాధిలో వివిధ రకాలు ఉన్నాయి. టీబీ సోకితే ఆరు నెలల మందులు వాడితే సరిపోతుంది. ఎండీఆర్ సోకితే దీర్ఘకాలంగా మందులు వాడాల్సి ఉంటుంది. ఎక్స్‌డీఆర్ సోకిన వారు ఆస్పత్రుల్లో డాక్టర్ల పర్యవేక్షణలోనే చికిత్స పొందాల్సి ఉంటుంది. ఈ విషయంగా ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాంతకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో నేలకోట, నేలకోటతండా, పోతులనాగేపల్లి, ఉప్పనేసినపల్లి, టేకులోడు, బ్రాహ్మణపల్లి, మండ్లి, పందిపర్తి, మొలకవేముల, ఒడ్డుకిందతండా, తురకలాపట్నం, మదిరేబైలుతండా, ఇరగంపల్లి, గోపేపల్లి, మసకవంకపల్లి, పులగంపల్లి, వేళ్లమద్ది, తిప్పేపల్లి, అమగొండపాలెం, పైపల్లి గ్రామాలు క్షయ రహితంగా అధికారులు గుర్తించారు. వ్యాధి నివారణకు ఎనిమిది ప్రాంతాల్లో వ్యాధి నివారణ యూనిట్లు ఏర్పాటు చేశారు. రోగులు అక్కడికి వెళ్తే మందులు ఉచితంగా అందిస్తారు. సకాలంలో డాక్టర్ల సలహాల మేరకు మందులు వాడితే వ్యాధి నియంత్రణలోనే ఉంటుంది.

జిల్లాలో క్షయ గణాంకాలు

ఏడాది	పాజిటివ్ కేసులు
2023	1,430
2024	2,119

జిల్లాలో సీబీ నాట్ ల్యాబ్‌లు	3 (కదిరి, బత్తలపల్లి, హిందూపురం)
ఆర్‌టీ పీసీఆర్ సైట్లు	31 (15 డ్యుయొ, 16 క్వాట్రో)
డీఎంసీలు	73
డ్రగ్స్ సెన్సిటివిటీ ల్యాబ్	బత్తలపల్లి (ఆర్డీటీ)

అవగాహన కల్పిస్తున్నాం



క్షయ నివారణకు పక్కా కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. ఒకరి నుంచి సగటున మరో 15 మందికి ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వ్యాధి సోకే విధానం, ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దీర్ఘకాలికంగా దగ్గు ఉన్నా.. ఆకలి మందగించినా.. బరువు తగ్గినా.. వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటే మంచిది. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ తిప్పయ్య, జిల్లా క్షయ అధికారి, పుట్టపర్తి